# ప్రణయభంగము

**"తల్లీ**, నీ పాదపద్మాలు చూశాక ధైర్యం కలిగింది. ఇక భయంలేదను కున్నాను. మునుపు హృదయంలో మండిన అగ్ని చల్లారిపోతుం దనుకున్నాను. శాంతి దొరుకుతుం దనుకున్నాను. కాని యిప్పుడీ ప్రశ్నలవల్ల డొంకంతా కదులుతోంది. గత కాలంలో పరమాణుభాగాల్లో జరిగిన సంగతులు కూడా జ్ఞాపకం వస్తున్నాయి. పరీక్ష చేస్తేగాని నీ పాదాలిని చేరనివ్వవని విన్నాను. జ్ఞాపకం వుంది, కాని ఆ ఘోర భయంకర వృత్తం మళ్ళీ జ్ఞాపకం వస్తుందని భయం. వచ్చిం దంటే వకపట్టాన మరుపురాదు. దానితో అతిప్రయత్నం మీద కలిగించుకున్న శాంతికి భంగం వస్తుంది".

"ఇదీ కారణం. ఇందుకోసం అడగవద్దంటున్నాను. కాదూకూడదంటే యేంచెయ్యగలనూ? సంతతసాధనవల్ల జగత్తు మిథ్య అనే భావం నీకు అనుభూతమై వుంది. కనుక యెలాంటి సంగతులు విన్నా నీ చిత్తం చలించకపోవచ్చును. గాని నా కట్టి ధైర్యం లేదే; అలాంటి చిత్తశాంతి నాకింకా కలగలేదే?"

"నీ యాజ్ఞని తిరస్కరించలేను. ఏమంటే? అందు కూడా హేతువు కనిపిస్తూనే వుంది. అదిగాక హృదయంలో పిహితమై వున్న ఆత్మానుభవాన్ని బయలుపరిస్తే హృదయభారం తగ్గుతుంది. ఆ చిత్తక్షోభ అణుగుతుంది. మంచికేనా చెడ్డకేనా హృదయంలో మళ్లీ స్థలం దొరుకుతుంది. కనక నీకు విన్నవించుకుంటాను".

"తల్లీ, నిన్ను పరివేష్టించి వున్న ఈ మాతృమూర్తు లందఱూ సులభంగానే చిత్తవృత్తి నరికట్టుకొనివచ్చి నిన్నాశ్రయించి వుంటారు. ఎవరికీ గూడా నాకు సంభవించిన అనుభవాలు సంభవించి వుండవు. వీరికే గాదు లోకంలో ఎవరికీ సంభవించి వుండవు. నా పూర్వ వృత్తం అంతా ఈశ్వరుని ప్రత్యేక సృష్టిలోనుంచి యేర్పడ్డది. ఏమంటావా? ఐహిక దృష్టితో చూస్తే యింత అభాగ్యురాలు జగత్తులో ఏకాలంలోనూ గూడా వుండదు. ఇంత నిరుపయుక్త పదార్థం యిక ముందు సృష్టింపబడదు".

"ఏం చెప్పను తల్లీ, ఐహికసుఖాలలో ఓలలాడిన సంసారంలో పుట్టాను. ఐహికవిడంబనాల్లో పెరిగాను; గాని నాకు సహధర్మిణీత్వం లభించలేదు. మాతృత్వం లభ్యపడలేదు. తోటి పిల్లలంతా యువతులైనారు. యువతులందఱూ పత్నులైనారు. పత్ను లందరూ తల్లులైనారు. ఇప్పుడందఱూ సుఖవతులై ఉన్నారు. కాని నేనుమాత్రం యెండుకట్టె నైపోయాను. తీవ్రమైన దావానం నాలో ప్రవేశించింది; గాని దగ్ధం చెయ్యలేకపోయింది. పొగలూ, సెగలూ విజృంభించాయి; గాని కట్టె కట్టెలాగే ఉంది. ఇంతకంటే దౌర్భాగ్యం యేమి వుందీ?"

"నా తల్లీ, చెప్పక తప్పదంటావా? అయితే చిత్తగించు, ఒక విధంగా ఆలోచిస్తే నా పూర్వచరిత్ర నా అదృష్టం వల్లనే అలా జరిగింది. ఏమంటావా? అది అలాంటిది కావడం చేతనే నాకు నీ అనుగ్రహం తప్పకుండా లభిస్తుంది".

## 2

'పీసపాటి భోగేశ్వరసోమయాజులంటే లౌక్యంలో రెండు మూడు జిల్లాల్లో పేరుపడ్డ పురుషుడు. అనేక వ్యవహారాల్లో దిక్కు తెలియక అనేకమంది యెక్కడెక్కడివాళ్లూ ఆయన సలహాకోసం వెతుక్కుంటూ రాయవరం వచ్చేవారు. యుగంధరుడు తరువాత అంతవాడని ఆయనకి పేరు వచ్చింది. ఆయన వేసిన యెత్తు యెప్పుడూ బుసికిపోలేదు. ముప్ఫయ్యేళ్లకి ముందు జరిగే వ్యవహారానికి యిప్పణ్ణుంచీ పునాదులు వేశేవాడు".

"ఆయన సహజంగా యింత ఉన్నవాడు. తరువాత స్వార్జితం గూడా బాగా చేర్చాడు. తానింత తిని వకళ్లకింత పెట్టడంలో ఆయనకి సాటిలేరు. పుట్టింటి మొదలు పోయీదాకా వక్కమోస్తరుగా కాలం గడిపినవాడాయన వక్కడే".

"ఆయన నలుగురు కూతుళ్ళలో నేను నాలుగోదాన్ని. యిద్దరు కొడుకులికీ చిన్నక్కని. "బుల్లిచెల్లాయి" అని అక్కలందఱూ నన్ను చేతుల్లో పెంచారు. "చిన్నక్క" అని తమ్ముళ్ళిదరూ నన్ను ప్రేమించారు. కడసారపుకూతుర్నవడం చేత మా అమ్మ ప్రేమ అంతా నామీదే కేంద్రీకరించింది. మా నాన్న గూడా నన్నలాగే చూశేవాడు."

"మా అమ్మ కల్లూరివారి ఆడబడుచు. ఆవికూడా పుట్టుభోగే. మా నాన్న మా అమ్మ యిష్టం వచ్చినట్లు నడిచేవాడు. అలాగని మా అమ్మ అప్రతిష్ఠ వచ్చే సలహా లేమీ చెప్పలేదు. ఈ మాట యెందుకు చెప్పానంటే? మా అమ్మకోమాటు చాలాజబ్బు చేసిందిట. బతకదని నిశ్చయం చేసుకున్నారుట అందరూనూ. వైద్యులందఱూ ఆశవదులుకున్నారుట. అప్పుడు మా అమ్మ మానాన్నని పిలిచి "అన్నీ అనుభవించాను. ఏమీలోటు యెరగను. ఇప్పుడు చచ్చిపోవడం అంటే కష్టంగానే ఉంది; గాని అయినా అదృష్టవంతురాలినే. వక్కలోటు ఉంది. అది మీరు తీర్చాలి. నరుసుకి పదేళ్లు వచ్చాయి. పెళ్ళి తలపెట్టండి. చూసి ఆనందంతో ప్రాణాలు విడుస్తాను" అందిట. వెంటనే మానాన్న ప్రయత్నాలు సాగించేడు. మర్నాడు మా అమ్మకి రోగం మళ్లిందట. వారం రోజులికి దగ్గిర కూచుని వాళ్లచేతా వీళ్ళచేతా పెళ్ళిపనులు చేయించే శక్తి వచ్చిందిట. నాకవన్నీ కొంచెం కొంచెం జ్ఞాపకం ఉన్నాయి."

"అనుకున్ననాడు నా పెళ్ళయింది. పెళ్లి అయిదు రోజులూ మా అమ్మ ఝూంకారంగా తిరిగింది. నన్ను మనుగుడుపుకి కూడా తీసుకువెళ్ళింది. కాని యింటికి వచ్చాక మళ్ళీ మంచం పట్టింది. దిగ్గజాల్లాంటి వైద్యుల్ని పిలిపించాడు మానాన్న. యేమయితే యేం? లాభం లేకపోయింది. మా అమ్మ పువ్వులరథం యెక్కి వెళ్లి పోయింది."

"మా నాన్న యెంత భోగో అంత విరాగి. మా అమ్మకి యిష్టమైనవన్నీ మా నాన్న వాళ్లకీ వాళ్ళకీ యిచ్చాడు. ఒకటి రెండేళ్ళలో నా అక్కలంతా కాపరానికి వెళ్ళిపోయారు. నేను మాత్రం యిల్లుపట్టేను. పెళ్ళి అయిన యేడాదికే నేను అనాథనైపోయాను"

## 3

"ఆ దుఃఖ వృత్తాంతం అంతా చెప్పడం యెందుకూ? తెలిసీ, తెలియని రోజుల్లో అది గడిచిపోయింది. యేదో మొగుడన్నారు పెళ్ళామన్నారు ముండా మోసిందన్నారు. అంతా అనుకున్నారు; గాని మొత్తానికి నాకేమీ అనుభూతం కాలేదు. మా అక్కలు నన్ను చుట్టుకొని యేడ్చారు. వాళ్ళని చుట్టుకుని నేను యేడ్చాను. కొన్నాళ్ళుండి యెవళ్ళింటికి వాళ్ళు వెళ్ళిపోయారు."

"ఇంట్లో వంటలక్క చేరింది. అరవై యేళ్ళు ఉన్నాయావిడికి. కష్టసుఖాలన్నీ తెలుసును. వెంకుసోదెమ్మ అంటే పీసపాటి వారికి దగ్గిర చుట్టం అనేకాని వంటలక్క అని యెవరూ అనుకోలేదు. నాకు మా అమ్మ లేనిలోటు కనపడ్లేదు. నన్ను వొడిలో కూచోబెట్టుకుని మా వెంకుసోదెమ్మపిన్ని కథలు చెబుతూ ఉంటే నాకు ఏమిటో ప్రపంచకం తెలిసేది కాదు. అలా పెంచింది ఆవిడ నన్ను. మా నాన్న నేను బంతిని కూచోనిదే భోంచేసేవాడు కాదు. చివరికి మంచి నీళ్లేనా పుచ్చుకునేవాడు కాదు".

"తల్లీ, నేను ముసలివాణ్ణయిపోయాను. ఎప్పుడో యీవూపిరి హఠాత్తుగా యెగిరిపోతుంది. నాయనలు చిన్నవాళ్లు. వాళ్ళకి పెద్దదిక్కు నువ్వే" అని కాగితాలన్నీ నాకు చూపించేవాడు. వ్యవహారపు సంగతులన్నీ చెప్పేడు".

"తమ్ముల్ని చదువుకోసం రాజమహేంద్రవరం పంపేడు మానాన్న. అక్కడ మా మేనమామల యింట్లో ఉన్నారు వాళ్లు."

"తరువాత కొన్నాళ్లకి నేను పెద్దదాన్నయినాను. మా వెంకుసోదెమ్మపిన్ని మూడు రోజులూ యేడించింది. మా నాన్న బిక్కమొగం వేసుక్కూచున్నాడు. ఇరుగుపొరుగువారంతా నన్ను వోదార్చేరు.

"అప్పటికి నాకు కొంచెం ప్రపంచకం తెలుస్తోంది. తోటిపిల్లలందరూ మొగుళ్ళు పండుగులికీ పబ్బానికీ వచ్చినపుడు చాటునా మాటునా తక్కుతూ బ్రహ్మానంద పడుతూ ఉంటారు. వెక్కిరించుకుంటారు. వేళాకోళా లాడుకుంటారు. యిక కిందా మీదా ఉండరు. ఏం చెయ్యనూ? అలాంటి సుఖం నాకు లేదు. అలాంటి ఆనందం నాకు లేదు. నేను యెండు కట్టెనని తెలిసింది. నల్లరాతినని తెలిసింది. కాని హృదయం అంటూ ఉంటే నల్లరాతికి మాత్రం దుఃఖం వుండదు కనకనా? దుఃఖించేను. ఇంట్లో మా అమ్మ బొమ్మా చూస్తే దుఃఖం. వీధిలో తోటిపిల్లల్ని చూస్తే దుఃఖం. ఏం చూసినా దుఃఖమే. దుఃఖమే నేనూ, నేనే దుఃఖమూ అయిపోయినాము".

"ఆ పాడు రోజుల్లో నాకు దుఃఖమే తోడూ. దుఃఖమే నీడ. దుఃఖమే జీవం. దుఃఖమే ధైర్యం, దుఃఖమే సకలమూనూ."

"దుఃఖం నాతో కూడా మసిలింది. కూడా పెరిగింది. చివరికి అది నాలో కలిసిపోయింది. అంటే నేను రూపొందిన దుఃఖాన్నయిపోయాను".

"తల్లీ, ఎడతెగకుండా వుంటే – విచ్ఛిన్నం కాకుండా వుంటే – నామమాత్రం కాకుండా వుంటే దుఃఖానుభవం కూడా ఆనంద కారణమే సుమా. మనస్సుకి యేకాగ్రత కలిగితే దుఃఖంలోను మాత్రం ఆనందచిహ్నాలు కనపడకపోతాయా! అప్పుడు దుఃఖాన్ని విడవగలమా?

దుఃఖాన్ని విడవడం అంటే నాకు యెలాగో వుండీది. ఇలావుండగా "బిడ్డా, యెదురొమ్ముమీద కుంపటిలా ఉన్నావు. నీ దుఃఖం చూస్తే నా కడుపు చెక్కలై పోతోంది" అన్నాడు ఒకనాడు మా నాన్న యేడుస్తూనూ. "నా కోసం యేడుస్తున్నావా? ఏడవకు నాన్నా! యేం లాభం? ఈశ్వరుడు చేసిన దానికి యెవరేమి చెయ్యఁగలరూ? నా కోసం నువ్వు దుఃఖస్తున్నా వంటే నాకు భయం వేస్తూవుంది. వూరుకో నాన్నా! దుఃఖం నా కోసం పుట్టింది. నేను దుఃఖం కోసం పుట్టేను. యుక్త సమయంలో యిద్దరమూ కలుసుకున్నాం. దుఃఖం యొక్క సహవాసం వల్ల నేను సుఖంగానే వున్నాను. ఇష్టానుభయం వల్ల లోకులంతా యెలా ఆనందిస్తారో నేనూ అలాగే ఆనందిస్తున్నాను. నాకోసం నువ్వు యేడవకు. ఏం లాభం? ఏడ్చియేం చెయ్యగలవూ? దుఃఖం నీకు కష్టాన్ని తెచ్చిపెడుతుంది. నా దుఃఖం నాకు సుఖాన్ని తెచ్చిపెడుతుంది. నా దుఃఖం నన్ను కింద అడుగుపెట్టనివ్వదు. నీకలా కాదు. తల్లి అద్దాల్లో బిడ్డయెలా కేరుతూ ఉంటుందో దుఃఖంహొడిలో నేను అలా కులుకుతూ ఉన్నాను. నా కోసం దుఃఖించకు నాన్నా" అని అనేక విధాల వోదార్చేను నేను''.

"మా నాన్నకి యేడుపు పోలేదు. నాపైట కొంగుతో యెన్నిమాట్లు తుడిచినా వసివాడిన మా నాన్న చెక్కుల మీది కన్నీటి ప్రవాహం ఆగలేదు. పెదవులు రావి ఆకుల్లాగ కదిలిపోతున్నాయి. ముఖం కందగడ్డలా అయిపోయింది. కంఠం సగంసగం పూడిపోయింది. అలాయేడుస్తూ మానాన్న నన్ను కౌగిలించుకుని "నాకూనా! గతించిన కార్యాలకి యిప్పుడెన్ని కారణాలు చెబితే మాత్రం యేం లాభమూ? మేం వకలా తలచగా భగవంతుడింకోలా తలిచేడు. నిన్ను ఇంటిలోనే అట్టేపెట్టుకోవా లనుకున్నాం. నీ భర్తని యిల్లరికం తెచ్చుకుందా మనుకున్నాం. నువ్వు పెద్ద కొడుకువనుకున్నాం. తక్కిన ఆశలిని తెంపివేసినా నువ్వు ఇంట్లోనే ఉండీలాగ చేశాడు ఈశ్వరుడు. నీ దురదృష్టం

కంటే మా పాపం- అందులోనూ నా పాపం యెక్కువదీ. నీ సుఖం కంటే నాదుఃఖం గొప్పదీ కనకనే యిలా జరిగింది. నా తల్లీ, జరిగిపోయినదానికి యెవరేమి చెయ్యగలరూ? దాన్ని తలుచుకుని దుఃఖిస్తే మాత్రం యేం లాభమూ? నీ దుఃఖాన్ని చూడలేను. నువ్వు యిలా ఉండడం చూడలేను. నా ఉత్తరగతికి భంగం కలిగించుకోలేను. బిడ్డా, సంఘం నన్ను నిందించనీ, దూషించనీ, తిట్టనీ, చివరికి తన్నుకు చావనీ, నేను జంకను. ఈశ్వరునికంటే నాకీపతితసంఘం గొప్పదిగాదు. ఏమయితే కానీ, నీకు మళ్ళీ పెళ్ళిచేస్తా" నన్నాడు.

## 4

"మళ్ళీ పెళ్ళా నాకూ? ఈ మాట వినేటప్పటికి ప్రపంచం అంతా గిర్రున తిరిగిపోయింది. "మా అమ్మా, నీకిష్టం ఉంటే రుద్రుడు వచ్చినా ఈ ప్రయత్నంలో నుంచి నన్ను మరల్చలేడు. మేం వెతికి చేసిన పని అలా బుగ్గయిపోయింది. నీ యిష్టం. ఆలోచించుకో. తొందరలేదు. తొందరపడవద్దు. యింట్లోనే దేవేంద్రం వైభవంతో పెళ్ళిచేసి నిన్నూ నీ రాజునీ యింటోనే ఉంచుకుంటాను. ఈ వూళ్ళో గాని, మన బంధువుల్లోగాని – నీ యిష్టం వచ్చినవాణ్ణి పెళ్ళిచేస్తాను. ఆలోచించుకో" అని చెప్పి మా నాన్న స్నానానికి వెళ్ళాడు."

"పద్దెనిమిదేళ్ళు నిండేయి. ఆడది సంసార రాజ్యంలో ఏకచ్ఛత్రాధిపత్యం చెయ్యవలసిన రోజులు. సంసారంలో సారం అంటూ ఉంటే దాన్ని అనుభవించే సమయం. భౌతిక ప్రపంచంలో నిగ్గయిన సందర్భం. పైగా "యిక లాభం లేదు" అని నిరాశ చేసుకుని ఉన్న సమయం. తల్లీ యేం చెప్పనూ?"

"మానాన్న స్నానానికి వెళ్ళేక కూచున్నదాన్ని కూచున్నట్లే వున్నాను. ప్రపంచకం అంతా గిర్రున తిరిగిపోయిందని చెప్పేనుకదూ! అనేక భావాలు, లెక్కలేనన్ని తలంపులు, చెప్పలేనన్ని యోచనలు, ఏర్పరింపలేనన్ని మార్గాలు చుట్టుముట్టాయి. పెళ్ళాడితే వచ్చీ సుఖం – ఆసంసారం ఆసిరి, ఆసంపత్తు, అన్నీ అలీకసాన్నిధ్యానికి వచ్చాయి. పారవశ్యం కలిగింది. మా అమ్మ యీకళ్ళకి

కనపడినది. "నా చిట్టీ! పెళ్ళాడు నా తల్లీ, నీ గొంతుక్కోశాను. నన్ను క్షమించు. నాపాపం పండి యిలా అయిపోయాను. నాబిడ్డా, పెళ్ళాడి ఈ యింట్లోనే రాజ్యం యేలుకో" అంటూ దగ్గరికి వచ్చి కౌగిలించుకుని ముద్దాడి యెత్తుకుంది"

"నా స్థితి నాకు తెలవలేదు. "ఇంకాయిక్కడే వున్నావా నా అమ్మా! భోజనానికి రా" అంటూ మా నాన్న తలుపు తీశాడు. చూడగా మా నాన్న మడికట్టుకుని బొట్టుపెట్టుకుని ఉన్నాడు. "అయ్యో, కనిపెట్టుకుని ఉన్నాడు కామోసు" ననుకుని నేను మాట్లాడకుండానే లేచివెళ్ళి మడికట్టుకుని భోంచేశాను."

"భోజన సమయంలో యీసంగతి వెంకుసోదెమ్మపిన్నికి తెలవడం యెందుకనుకున్నాడు కాబోలు మా నాన్న యేమీ మాట్లాడకుండా తిని పడుకోడానికి వెడుతూ "తల్లీ, జాగర్తగా ఆలోచించుకో" అని చెప్పేడు."

## 5

తల్లీ నువ్వు తప్పన్నా సరే, వొప్పన్నాసరే, పెళ్ళిమీదికి దృష్టిపోయింది నాకు. ఇష్టాపూర్తిగా కన్నతండ్రి సెలవిచ్చేక నాలాంటి యేఅనాథ పెళ్ళాడాలని ముచ్చటపడకుండా ఉండగలదూ"

"ఆలోచించాను. ఎవర్ని పెళ్ళాడనూ? మళ్ళీ పెళ్ళాడాలని తలంచుకునే వితంతువులకంటే వితంతువుని పెళ్ళాడ్డానికి సిద్ధపడీ పురుషులు తక్కువ. అయినా నా తండ్రి వప్పుకున్నాడు గనక యెవరో సాహసించకపోరు, గాని అలాంటి పురుషుణ్ణి పెళ్ళాడ్డం యేమి సుఖమూ?"

"మా యింటికి సరీగ్గా యెదట వక బ్రాహ్మడు వున్నాడు. ముప్ఫయేళ్ళు వెళ్లేయి. మూడేళ్ళకిందట పెళ్ళాం చచ్చిపోయింది. మళ్ళీ పెళ్ళి కాలేదు. అందుకు కారణం లేకపోలేదు."

"చిన్నప్పుడే తండ్రి చచ్చిపోయాడు. ఎలాగో కష్టపడి తల్లి పెళ్ళి చేసింది. కాపురానికి వచ్చిన నాలుగేళ్ళకి పురుట్లో పెళ్ళాం చచ్చిపోయింది. ఆస్తి తక్కువ. మానాన్నా నాశ్రయించి యేసాక్ష్యానికో వెళ్ళి నాలుగురూపాయలు సంపాదించు కుంటూ కాలం గడుపుతున్నా డాయన. మళ్ళీ యెలాగేనా పెళ్ళిచేయాలని తల్లి మా నాన్న నాశ్రయించింది. ఈప్రయత్నం యిలా జరుగుతూ ఉండగా

యెలా సంభవించిందో ఆయన వక బోగందాన్ని ఉంచుకున్నాడు. దానితో మానాన్న "దూరంగా ఉండు" అన్నాడు. తల్లి యేడ్చింది గాని లాభంలేక పోయింది. అతనిమీదకి పోయింది నా చూపు".

"అమ్మా ఏం చెప్పనూ? ఆస్తి తక్కువ. పైగా బోగందాన్ని ఉంచుకోవడం యెరుగుదును, మా నాన్న అతణ్ణి ద్వేషిస్తున్నాడని తెలుసును. కాని మనస్సు అతనిమీద వాలింది. ఏమిటీగతీ? ఈ సంగతి మా నాన్నతో యెలాగా చెప్పడం?"

ఏమీ దారితోచిందిగాదు. నెలరోజులు ఆటమటించిపోయాను. పదిహేనురోజులు యేమయినా సరే చెబుదామని వెళ్ళి నాలిక చివరికి తెచ్చుకుని మళ్లీ అంతట్లో భయపడి వూరుకునీదాన్ని. చివరికి వకనాడు సాహసించాను. "ఏం తల్లీ, ఏమి ఆలోచించా"వన్నాడు మానాన్న. "సందేహించకమ్మా! నువ్వు కోరినవాణ్ణి తెస్తాను. నాకూనా! నీ సుఖమే నాకు ప్రధానం" అన్నాడు. యెలాగో సాహసించి జగ్గయ్యమామ సంగతి యిప్పుడెలావుంది నాన్నా?" అన్నాను.

"జగ్గయ్యా" అని మానాన్న తెల్లపోయాడు. ఏతల్లీ, నీకలాంటి సంకల్పం కలిగిందా? ఆస్తికోసం చూడ్డం లేదు. సాంప్రదాయం మంచిది కాకపోలేదు. చక్కదనానిక్కూడా లోటులేదు. కాని గుణం చెడింది. అంధకారంలో వున్నాడు" అన్నాడు మానాన్న. "మరల్చలేవా?"అన్నాను నేను. "తప్పకపోతే ప్రయత్నిస్తాను. ఈ సంగతి తెలిసిదంటే బోగందాన్ని యెడం కాలితో తన్నుతాడు జగ్గయ్య. కాని నాలుగురోజులనుంచి కనబడ్డంలేదు" అని మానాన్న చెప్పగా "ప్రయత్నం చెయ్యి" అని మాత్రమే నేను అనగలిగాను. మా నాన్న వెంటనే లేచి వాళ్ళ యింటికి వెళ్లేడు. నా గుండెలు కొట్టుకోవడం మొదలుపెట్టేయి"

## 6

"శ్రీహరీ, సంసారం గతే అలాంటిదీ, ఏది ప్రియమో దానియందు కొన్ని భరించరాని దోషాలు ఉంటాయి! ఒక్కొక్కప్పుడది అందరాని పండయిపోతుంది. మా నాన్న మాటలు విని జగ్గయ్యమామ లెంపలు వాయించుకున్నాడుట. చాలా పశ్చాత్తాప పడ్డాడుట. కాని మంచం మీద ఉన్నాడు. శరీరం పాడయింది. "క్షమించు మామా. నరసమ్మపాదధూళి

శిరస్సుమీద ధరించడానికేనా తగను నేను" అంటూ నారాజు మా నాన్న కాళ్ళమీద పడ్డాడుట. ఈ స్థితివినగానే మానాన్నకి యేడుపు వచ్చిందిట. ఆశ్చర్యమా తల్లీ! అప్పుడలా అయిపోయాను. యిప్పుడీ వుద్భృతం. నిర్ఘాంతపడిపోయాడు మా నాన్న, "తల్లీ, యీశ్వరేచ్ఛ యెలా ఉందో చెప్పలేను. స్థితి యిదీ" అని మానాన్న చెప్పేటప్పటికి నా ప్రాణాలు యెగిరిపోయాయి.

"ఈశ్వరా ఈక్షుద్రప్రాణిని యెందుకోసం సృష్టించావూ. ఈ జన్మకింతకంటే యోగ్యత లేదూ? ఈ పాషాణానికి యింకా కాఠిన్యమే కలిగిస్తావా? ఈ లోహానికి యింకా నైచ్యమే కలిగిస్తావా? బంగారంగా పుట్టించి యినుము గానేనా చెలామణీ కానియ్యవూ" అంటూ విచారించాను. ఏం లాభమూ."

"ఆవేళ గడిచిపోయింది. "నా తల్లీ! వెనుకటిస్థితే బాగుంది దీనికంటే. జ్ఞానం లేనప్పుడేం జరిగిందో యెరగవు. ఈయేటి యావలి గిలికింతలు ప్రాణాంతకంగా ఉన్నాయి. తోడేలు నోటినుండి పులివాతపడ్డావు. నాకూనా, యేమి గతి?" అంటూ మళ్ళీ మానాన్న బెంగపెట్టుకున్నాడు.

"రాయిగానే ఉన్న నా మనస్సుకి మరింత ధైర్యంతెచ్చుకున్నాను. "నాన్నా విచారించకు. ఇప్పటి కేనా యీశ్వరకటాక్షము లేకపోతే లేదనుకున్న సుఖం లేకనే పోతుంది. యేం చెయ్యనూ? మనస్సు అక్కడ తగిలింది. యిక అది యివతలికి రాదు. రావడంకోసం ప్రయత్నం చెయ్యను. కష్టమేనా సుఖమేనా అతనే కావాలి. బతికినా లేకపోయినా అతనే నారాజు. అతనిదగ్గిర వకటే దోషం వుంది. అది పండింది. నేను అదృష్టవంతురాలి నయితే అతను బతుకుతాడు. నేను సుఖపడతాను. నా ప్రణయాన్ని అంగీకరించాడని విన్నాను. ఈ పాడు జన్మకు అది చాలదూ? అది కోటి గుణితం కాదు? పూర్వజన్మలో యెన్ని మిథునాలకో ఎడబాటు కలిగించి ఉంటాను. ఆ పాపం ఇప్పుడు కట్టి కుదుపుతోంది. తప్పదు. ఇప్పుడు బోధపడ్డది. ఈ బోధ సామాన్యమైనది కాదు. ఇక విచారం నా దరికైనా రాలేదు. చేసుకున్నది అనుభవించక తీరదు. నా భవిష్యత్తు ఎలా ఉందో కాలం చెపుతుంది. మనకి ఏం తెలుస్తుంది ఇలాంటి తృప్తి కలగటమే జన్మకు ముఖ్యం. నాకు అది లభించింది. కనుకనే ఇక దుఃఖం రాదన్నాను. ఓపిక పట్టు అన్నాను మా నాన్న ఇది విని కుంగిపోయాడు."

"తెలిసీతెలియని వైద్యుడు నారాజుకు రసం పెట్టేడు. తెల్లారేటప్పటికి మోపుచేసింది. బాధ పెరిగిపోయిందని తెలిసింది. వుండలేకపోయాను."నాన్నా! మొదటి నుంచి నా బ్రతుకు అపసవ్యంగానే వుంది. ఏం చెయ్యను? నీ అనుగ్రహాన్ని ఇలా వినియోగించుకోవాల్సి వచ్చింది. క్షమించు. దర్శనానికి సెలవు ఇవ్వవు? ఈ కళ్ళకేనా ప్రకాశం కలిగించుకోనివ్వవు?"అని బ్రతిమాలేటప్పటికి మా నాన్న దుఃఖం ఆపుకోలేకపోయాడు. వెంటనే నన్ను తీసుకువెళ్ళాడు"

నన్ను చూసేటప్పటికి నా రాజు కళ్ళల్లో దివ్యతేజస్సు మెరిసిపోయింది. ఆ చామనచాయలో నైగనిగ్యం ఇంకా మాసిపోలేదు. ఆ మోహనమూర్తిలో ఇంకా జీవకళ మారుమొగం పెట్టలేదు. చూసీ చూడడంతోటే బాధపడుతూనే లేచి కూర్చున్నాడు నా రాజు."నరుసు నీ ఎడమపాదం నా నెత్తిమీద ఉంచు. పాపాత్ముణ్ణి. రాక్షసుల్లో కూడా సాటి లేని హీనాత్ముణ్ణి. అయినా నేను పూర్వజన్మలో ఏ క్షణంలోనో గొప్ప పుణ్యం చేసుకున్నాను. కనుకనే ఇప్పుడు నీ అనుగ్రహం కలిగింది. దేవీమూర్తి! ఏంచెప్పను. నేను పాపపంకంలో పడిపోయి ఉండటం యదార్థమే. కానీ నువ్వు ఇలాంటి అనుగ్రహం మొదటేచూపిస్తే చెడకపోయి ఉందునని చెప్పడానికి ఇది ఇలా అవుతుందని అనుకోవడానికి ఏం ఆధారముంది. నీకు కలిగిన అది మీ నాన్న – నా మీద ఆగ్రహంతో ఉన్న నీ తండ్రి అంగీకరిస్తాడని అనుకోవడం ఎలాగా? అంతా ఆశ్చర్యంగా ఉంది. నేను బ్రతికితే ధన్యుణ్ణే. లేకపోయినా ఈ సంగతి వినటం చేత, నీ దివ్యదర్శనం లభించటం చేత నేను అంతకంటే ధన్యుణ్ణి" అంటూ శిరస్సు వంచాడు. నేను వెళ్ళిపట్టుకున్నాను. " వద్దు వద్దంటూనే నాకాళ్ళు ముట్టుకుని ఆ చేతులు కళ్ళకద్దుకున్నాడు నారాజు"

"తల్లీ! నా రాజు హృదయం సహజంగా ఎంత కోమలమైంది. ఎంత ఉన్నతమైంది. ఈ నడుమంత్రపు దౌర్భాగ్యం తటస్థించకపోతే నేను ఎంత సుఖవతినై యుందును? కానీ ఈశ్వరాజ్ఞ నెవరేమి చెయ్యగలరు?"

"నా తండ్రి సెలవిచ్చేడు. నా అమ్మమ్మ ఆశ్చర్యంతో అంగీకరించింది. నా రాజుకు నేను పరిచర్యలు చేయడం మొదలుపెట్టాను"

"ఏమి సుఖమని చెప్పను తల్లీ! సేవలోనే ఆడదానికి సుఖం వుందని అప్పుడు నాకు అనుభవం అయింది. అందులోనూ నారాజుకి పరిచర్య

చేయడంకంటే యేమిభాగ్యము వుంది? "దేవీ నీ ముఖం చూడడం చేత నాకు బాధ తెలవడం లేదు. కానీ మనస్సుకి ఆరాటం మాత్రం పెరుగుతూ ఉంది. ఎంతహీనుణ్ణి నేను" అంటూ అయిదారుమాట్లు నా రాజు అన్నాడు కాని ఒట్టుపెట్టి ఆ మాట మానిపించాను నేను"

"నా రాజుకి నేను అన్నం కలిపి నా చేత్తో పెట్టుకున్నాను. నా చేతులతో పాద సేవ చేశాను. కొంచెం బాధతగ్గి నా రాజుకి కంటిమీద కునుకు వచ్చినప్పుడు నా బాధలన్నీ మర్చిపోయి భవిష్యత్తులో పడీదాన్ని. ఏమి సుఖం తల్లీ? నా జన్మాని కది చాలు".

"అమ్మా! ఇలా నాలుగురోజులు గడిచాయి క్రమంగా పురి ఎక్కిన ఆశ బిగి తగ్గింది. తెల్లవారేటప్పటికి నా రాజు స్థితి విషమించింది. నాకు జ్ఞానం తప్పిపోయింది. నా రాజు నన్ను అంధకారంలో గెంటేసి వెళ్ళిపోయాడు"

"ఇది నా పూర్వవృత్తం. తల్లీ, నా క్షుద్రజీవనం ఇన్ని విధాలా బగ్గం పాడయిపోయాక ఇక నాకు సంసారంలో యేంవుంది? ఏమి చూసుకుని నేను ఆ కారాగృహంలో ఉండను? నీ పాదాలు తప్ప నాకు ఇంకా ఆశ్రయం ఏమి ఉంది? నా తండ్రి సన్యసించడానికి కాశీ వెళ్ళిపోయాడు. నేను వెతుక్కుంటూ ఈ కొండల్లో నీ కోసం వచ్చాను. మా అమ్మా! నాకు ఆశ్రయం ఇవ్వవూ? నీ పాదరజస్సు నా శిరస్సుమీద ధరించడానికి అధికారం ఇవ్వవూ. ఈ క్షుద్రజంతువుకి ఉత్తరలోకంలోనైనా సుగతి ప్రసాదింపవూ." ◆